ఊరూరా ఉగాది శోభ

- ఇంటింటా విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగత ఏర్పాట్లు
- పంచాంగ శ్రవణానికి సిద్ధమైన దేవాలయాలు



ఉగాది పచ్చడికి సిద్ధం చేసిన వస్తువులు



కాజులూరులో వేపపువ్వు కోసేందుకు చెట్టెక్కిన బాలలు, యువకులు

కాజులూరు: విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఊరూరా ఏర్పాట్లు జరుగుతున్నాయి. క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన తెలుగు సంవత్సరానికి ఆహ్వానం తెలుపుతూ ఉగాది పచ్చడిని తయారు చేసుకునేందుకు ప్రతి ఇంటా ప్రజలు సన్నద్ధమౌతున్నారు. మామిడి తోరణాలు.. పూల అలంకరణలు.. వేప పూత సుగంధాలు.. రంగురంగుల హరివిల్లులతో ప్రతి ఇల్లు తెలుగు సంవత్సరాది శోభను సంతరించుకున్నాయి. చెరుకులోని తియ్యదనం.. వేప పువ్వులోని వగరు.. కొబ్బరిలోని కమ్మదనం.. అరటిలోని మధురం.. చింతలోని పులుపు.. పచ్చిమిరపలోని కారం తదితర షడ్రుచుల మేలు కలయికే ఉగాది పచ్చడి. సుఖ సంతోషాలు, కలిమిలేముల్లోని జీవిత మాధుర్యాన్ని చాటిచెబుతూ ఉగాది రోజున వేప పచ్చడిని ఫలహారంగా ఆరగించడం తెలుగువారి ఆనవాయితీ. తూర్పుడెల్టా డివిజన్‌లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గంలోని పట్టణ, మండల గ్రామాల్లోని వాడవాడలా శనివారం ప్రతి ఇల్లు ఉగాది ఏర్పాట్లతో కళకళలాడాయి. చదువు, ఉద్యోగం, వ్యాపారం తదితర పనులతో ఎక్కడెక్కడో నివాసముంటున్న వారంతా ఉగాది కోసం తమతమ స్వస్థలాలకు రావడంతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఉగాది ఏర్పాట్లే. ఎక్కడ చూసినా చిన్నారులు, పెద్దలు చెట్లెక్కి వేపపువ్వు సేకరణలో సందగా, బిజీబిజీగా ఉన్నారు. మహిళలు ఇళ్లను శుభ్రం చేసుకోవడం, పిండి వంటల తయారీ, వేప పువ్వును బాగు చేసుకోవడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. పండగ నిర్వహణకు అవసరమైన సామగ్రి కొనుగోలు కోసం గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులతో పట్టణ, ప్రధాన గ్రామాల్లోని వస్త్ర, కిరాణా, స్వీటుస్టాల్స్ తదితర దుకాణాలు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు గ్రామాల నుంచి సైకిళ్లపై వేప పువ్వు, మామిడికాయలు, తీసుకువచ్చి పట్టణ, ప్రధాన గ్రామాలల్లోని మార్కెట్‌లోనూ, వీధుల్లోనూ తిరుగుతూ పెద్ద ఎత్తున వ్యాపారం చేశారు.

నేడు ప్రత్యేక పూజలు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ, గ్రామాల్లోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కాజులూరు రామాలయం, గొల్లపాలెంలోని శివాలయం, మొగలిపాలెంలోని దుర్గాదేవి ఆలయం, గొల్లపాలెం శ్రీకంఠరుషి ఆశ్రమంలోనూ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

సంస్కృతీ సంప్రదాయాల పండగ

రామచంద్రపురం: మన సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేసే పండగ ఉగాది పండుగ అని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రామకృష్ణ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది ఉత్సవాన్ని తెలుగు, బోటనీ విభాగాలు శనివారం సంయుక్తంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యక్షత వహించిత మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేసే పండుగ ఈ ఉగాది అని, ఉగాది పచ్చడిలో షడ్రుచులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.శ్రీనివాస్, వై.పద్మజ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సృష్టి ప్రారంభమే ఉగాది



చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మదేవుడు సృష్టి ప్రారంభింపజేశాడని పురాణాలు చెబుతున్నాయి. యుగానికి ఆది కావడంతో ఈ రోజున యుగాది అని పలికేవారు. ఉచ్చారణలో కాలక్రమేణ అదే ఉగాదిగా వ్యవహరించబడుతుంది. చాంద్రమానం పాటించే ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల్లో నేడు (ఆదివారం) ఉగాది జరుపుకొంటున్నారు.

– పెద్దింటి కృష్ణమోహనాచార్యులు, అర్చకుడు, గొల్లపాలెం

ఘనంగా ఉగాది వేడుకలు



పాఠశాలలో సందడి చేస్తున్న విద్యార్థులు

మండపేట: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలు, తెలుగు వారి పండుగలపై అవగాహన పెంచుకోవాలని సంగం కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ అన్నారు. శ్రీవిశ్వవసు నామ సంవత్సర ఉగాది ముందస్తు సంబరాలను పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా చీరకట్టు, పంచెకట్టు వంటి సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. చిన్నారులకు ఉగాది గొప్పతనాన్ని వివరించారు. ఉపాధ్యాయులు ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, సత్యనారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉగాది అందరికీ ఆనందం పంచాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేట: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది అని, పండుగ ప్రతిఇంటా సుఖ సంతోషాలు, భోగభాగ్యాలను కలుగజేయాలని వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆకాంక్షించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నియోజకవర్గ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మరో తెలుగు నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆరోగ్యం, అభివృద్ధి, ఆనందం పంచాలని కాంక్షించారు. తలపెట్టిన కార్యంలోను విజయాలు వరించి ముందుకు సాగాలన్నారు. రైతులు పంటలు బాగా పండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. మరో పదిహేను రోజుల్లో రైతన్న ఆరుగాలం పండించిన పంట చేతికి రాబోతోందని, పంటలు బాగా పండి ప్రతి రైతు కుటుంబం సిరులు, ఆనందంతోను నిండిపోవాలని రైతు బిడ్డగా తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



అముజూరులో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ బోస్, సూర్యప్రకాశ్ తదితరులు

కె.గంగవరం: మండలంలోని పామర్రు, అముజూరు గ్రామాల్లో ఎంపీ ల్యాడ్స్ నుంచి మంజూరు చేసిన రూ.20 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణాలకు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లు శనివారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీటీసీలు సాదే కపిల్, నీతిపూడి మధుబాల, సర్పంచ్‌లు నానాపరపు కళ్యాణి, చీకట్ల సునీతలతో కలసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పెట్టా శ్రీనివాసరావు, మేడిశెట్టి శ్రీనివాస్, పెంకే రవిచంద్ర, గెద్దాడ సతీష్, నానాపరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా నూకాలమ్మ తీర్థం

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. శనివారం ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. పండితులు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, టేకి, తాతపూడి, తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, కర్రసాము తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారంతో అమ్మవారి జాతర ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గ్రామ దేవతల జాతరలు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో శనివారం గ్రామ దేవతల జాతరలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జానకమ్మ, గ్రామ శివారులోని లలితా విజయదుర్గా అమ్మవార్ల జాతరలు వైభవంగా జరిగాయి. అమ్మవారి ప్రతిరూపాలైన గరగలను శిరస్సున ధరించిన ఆసాదులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం అమ్మవార్ల తీర్థం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీలు తెలిపాయి.

వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల అధ్యక్షుల నియామకం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కొత్తపేట, మండపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం పత్రాలను శనివారం పంపించింది. కొత్తపేట నియోజకవర్గానికి కళా అప్పారావు, మండపేట నియోజకవర్గానికి సలాది ఎస్.చంద్రరావు నియమితులయ్యారు.

పదో తరగతి సోషల్ పరీక్ష వాయిదా

మండపేట: రంజాన్ పండగను పురస్కరించుకుని ఈ నెల 31న జరగాల్సిన పదో తరగతి సోషల్ పరీక్ష వాయిదా పడినట్టు మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు శనివారం తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాయిదా పడిన సోషల్ పరీక్షను ఏప్రిల్ 1న నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

దోమల నిర్మూలనకు చర్యలు



పారిశుధ్య కార్మికులకు ఎంఎల్ ఆయిల్ అందజేస్తున్న అధికారులు

మండపేట: పట్టణంలో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. దోమలను అరికట్టడానికి గాను శనివారం పారిశుధ్య కార్మికులకు ఎంఎల్ ఆయిల్ సరఫరా చేశారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పర్యవేక్షణలో కార్మికులు దోమల నివారణ మందు పిచికారీ చేయనున్నారు. 30 వార్డుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని చైర్‌పర్సన్ దుర్గారాణి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య, దోమల నివారణ చర్యలను ఆమె పరిశీలించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు సందక ఉమామహేశ్వరరావు, చంద్రు రామకృష్ణ, కడితి వెంకట్రావు, సచివాలయ కార్యదర్శులు శేఖర్, రాజేంద్ర, వెంకన్నబాబు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి పరామర్శ

కపిలేశ్వరపురం: మామ వియోగంతో బాధపడుతున్న నేలటూరు ఎంపీటీసీ సభ్యురాలు రుద్రాక్షుల వీరగౌరీ కుమారిని శనివారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు వీరగౌరీ కుమారి ఇంటికి వెళ్లి ఓదార్చారు. పరామర్శించిన వారిలో పలివెల మధు, కుక్కల వీరన్న, పెందుర్తి తేజ, మేడిశెట్టి దుర్గారావు, రుద్రాక్షుల శ్రీనివాస్, కొప్పిశెట్టి రామ్‌కిశోర్ ఉన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



మండపేటలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం/మండపేట: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అంగరలో పార్టీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండపేటలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ వుంగరాల రాంబాబు, నాయకులు గడి సత్యవతి, గుండు తాతరాజు, మల్లిపూడి గనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్ విందు

వై ఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్



ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న పృథ్వీరాజ్

మండపేట: రంజాన్ మాసంలో ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందులు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ యువనేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ అన్నారు. స్థానిక కలువపువ్వు సెంటర్‌లోని జామియా మసీదులో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ సెల్ నాయకుడు సయ్యద్ రబ్బానీ, పార్టీ నాయకులు షేక్ గౌస్, సర్కార్ ఆయనను శాలువాతో సత్కరించారు. ముస్లింలతో పాటు పృథ్వీరాజ్ సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ఐకమత్యాన్ని చాటుతాయన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడు యరమాటి వెంకన్నబాబు, విద్యార్థి విభాగం నాయకులు తణుకు అశోక్, సాధనాల శివభగవాన్, షేక్ అర్షద్, షేక్ సర్కార్, సయ్యద్ మైనర్ బాబు, షేక్ జిలాని, షేక్ ఇమ్రాన్, షేక్ కష్మూర్, సయ్యద్ ఫజల్, షేక్ మస్తాన్, షేక్ అమీర్ జదా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

కాజులూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటి బేస్డ్ న్యాచ్రల్ ఫార్మింగ్)లో భాగంగా ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌పై వ్యవసాయశాఖ మండల స్థాయి సిబ్బందికి, డ్వాక్రా సంఘాలకు, రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏఓ అశోక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు ఖర్చులు తగ్గడమే కాకుండా విషతుల్యం కాని నాణ్యమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ కార్యాలయం నుంచి మాస్టర్ ట్రైనర్ ధనలక్ష్మి హాజరై సభ్యులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, ఐసీపీఆర్ సత్యవతి, పలువురు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై బాలికలకు అవగాహన ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి నాగేశ్వరరావు నాయక్

రామచంద్రపురం: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'మహిళలు–లైంగిక వేధింపులు' అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. లైంగిక వేధింపులు బాలికలపై అధికమవుతున్న తరుణంలో పోక్సో చట్టం వారికి రక్షణ కవచంగా ఉపయోగపడుతుందన్నారు డీఎస్పీ డి.రఘువీర్, సీఐ శంకర్ నారాయణలు మాట్లాడుతూ బాలికలు వివిధ ఆకర్షణలకు లోనై పలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజీపీ ఎల్.కమలకుమారి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష కార్యదర్శులు పలివెల సత్యనారాయణ, సాయిప్రసాద్ వాడ్రేవు, ఎంఎల్ఎస్‌సీ సభ్యులు పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలీ అన్సారి, వైస్ ప్రిన్సిపాల్ వి.రవీంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ప్రజలను కాపాడడానికే న్యాయ వ్యవస్థ ఉందని రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ద్రాక్షారామ శ్రీచైతన్య స్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో మహిళలపై ముఖ్యంగా బాలికలపై పెరుగుతున్న లైంగిక వేధింపుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలలకు రక్షణ కల్పించే పోక్సో చట్టం గురించి వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ మహిళా పోలీసు అనిశెట్టి నందినిరెడ్డి, శ్రీచైతన్య రీజినల్ ఇన్‌చార్జి ఎంవీ నరేష్, పిన్సిపాల్ లీలా వంశీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో బంగ్లాదేశ్ వాసి ?

మండపేట: పట్టణంలోని ఓ పరిశ్రమలో బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తి వలస కార్మికుడిగా ఉన్నట్టు ప్రచారం జోరందుకుంది. వివరాల్లోకి వెళితే.. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండపేట పట్టణంలో వలస కూలీలు అంతకంతకూ పెరుగుతున్నారు. పాడి, పౌల్ట్రీ, ఆయిల్ తదితర పరిశ్రమలు పరిసర ప్రాంతాల్లో విస్తరించిన విషయం తెలిసిందే. కూలి రేట్లు కూడా ఎక్కువ ఉండడంతో వీటిలో పనిచేసేందుకు అవసరమైన కూలీలు వివిధ రాష్ట్రాల నుంచి వస్తూ పారిశ్రామిక అవసరాలు తీరుస్తున్నారు. కానీ యాజమాన్యాలు వచ్చిన అందరినీ తీసుకుంటున్నారు తప్పితే వారు ఎవరు ? ఎక్కడి వారు ? దేశ విద్రోహ శక్తులు, చొరబాటుదారులు, తీవ్రవాదులు, నేరస్తులు కాదు కదా అనే విషయాలను పట్టించుకోవడం లేదు. తాజాగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారు ఇక్కడ పనిచేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందుకు కారణమూ లేకపోలేదు. ఓ వ్యక్తి కేపీ రోడ్డులో ఉన్న మెడికల్ షాపుకు వెళ్లి ప్రిస్క్రిప్షన్ చూపించి టాబ్లెట్లు ఇవ్వాలని కోరాడు. సదరు షాప్ నిర్వాహకుడు ఆ చీటీ చూసి తానెప్పుడు ఇలాంటి మందులు చూడలేదని ఆశ్చర్యపోయినట్టు తెలిసింది. బంగ్లాదేశ్‌లో వినియోగించే మందులని ఆయన అనుమానం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంలోనే బంగ్లాదేశీయులు పోలీసులకు చిక్కారనే వీడియో దృశ్యాలు ఫేస్‌బుక్‌లో చూసిన నెటిజన్లు, ఎక్కడో ఏమిటి మన మండపేటలో లేరేంటి అని ఆ వీడియోకు కామెంట్ పెట్టడం చర్చనీయాంశమైంది.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే



కామన ప్రభాకరరావు

మండపేట: ఏపీని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు విమర్శించారు. ఏడిద రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. రాత్రి, పగలు తేడా లేకుండా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై అబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ అధికారుల అవినీతి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మరీ పెచ్చుమీరిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా అధికారులకు ముట్టేది కాదని, కూటమి అధికారంలోకి రాగానే ఎక్సైజ్ అధికారులు మద్యం సిండికేట్లతో చేతులు కలిపి జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అలాగే హైకోర్టులో ప్రజావాజ్యం వేస్తానని స్పష్టం చేశారు. మద్యం సిండికేట్లకు నియోజకవర్గంలో కూటమి నాయకులు అండగా నిలిచారని ఆరోపించారు.

భీమేశ్వరాలయంలో నేడు ఉగాది సంబరాలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నేడు ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని శనివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 6.45 గంటలకు పంచాంగ పూజ, 9.10 గంటలకు ఉగాది సంబరాలు, సాయంత్రం 3.30 గంటలకు పంచాంగ శ్రవణం, 6.30 గంటలకు మాణిక్యాంబా అమ్మవారికి వసంత నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని విశేష సువర్ణ, రజత పుష్పార్చన, రాత్రి 8.30 గంటలకు నీరాజన మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తి, ప్రసాద వితరణ నిర్వహించడం జరుగుతుందన్నారు.

తనను తొలగించవద్దంటూ అధికారులకు వినతి

కపిలేశ్వరపురం: మండలంలోని అద్దంకివారిలంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలిగా దీర్ఘకాలంగా పని చేస్తున్న తనను తొలగించవద్దంటూ గ్రామానికి చెందిన తరిట్ల మంగాయమ్మ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈఓ షేక్ సలీంబాషాలను కోరారు. తన తొలగింపు అన్యాయమంటూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానని, జిల్లా విద్యాశాఖాధికారికి వినతి పత్రాన్ని అందజేసినట్టు శనివారం మంగాయమ్మ తెలిపారు. తాను 25 సంవత్సరాలుగా పాఠశాలలో పని చేస్తున్నానని, ఈ నెల 21న అకారణంగా విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఎలాంటి తీర్మానం చేయకుండా, పాఠశాల పేరెంట్స్ కమిటీకి సమాచారం ఇవ్వకుండా విధుల నుంచి తొలగించడంతో తాను ఉపాధిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళా శిక్షణ తరగతులు

కె.గంగవరం: మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో 2025–26 ఆర్థిక ప్రణాళిక, వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికల నమోదు ద్వారా ఆశిస్తున్న ఫలితాలు, సర్వేలపై మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారం ప్రారంభించారు. డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ టి.సాయినాథ్ జయచంద్ర(గాంధీ), సెర్ప్ డైరెక్టర్ బి.శ్రీనివాసు, ఏపీఎంలు వి.విజయ, ఎస్.దుర్గమ్మలు ప్రతి గ్రామ సంఘాల నుంచి వచ్చిన ఎన్యూమరేటర్స్, వీఓఏలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బి.పద్మావతి, జి.దుర్గాప్రసాద్, జి.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మండపేట: జనావాసాల నడుమ మద్యం షాపు పెట్టి ప్రజలకు లేనిపోని చిక్కులు తెచ్చిపెట్టొద్దని 28, 29, 30 వార్డు ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానిక సత్యశ్రీ రోడ్డులో ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజు శనివారం కొనసాగాయి. ఇళ్ల మధ్య వైన్ షాపు వద్దన్నా స్థానిక ప్రజలను లెక్క చేయకుండా పెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు వార్డుల మహిళలు పాల్గొన్నారు.

మంచితనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు

టీడీపీ ఫ్లెక్సీ, జెండాలు చించడంపై మంత్రి సుభాష్

రామచంద్రపురం: నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తున్నామని, కొంతమంది ఆకతాయిలు పార్టీ ఫ్లెక్సీలు చించడం, పార్టీ పతాకాలు పీకడం వంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తప్పవని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. టీడీపీ 43వ ఆవిర్భావం సందర్భంగా పట్టణంలోని ఏడో వార్డులోని శీలంవారి సావరంలో కొంతమంది ఆకతాయిలు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు చింపి పారవేయడంపై మంత్రి సుభాష్ తీవ్రంగా స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన వెనక ఎవరున్నా వారిపై చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరి పార్టీపై వారికి అభిమానం ఉండవచ్చు. కానీ మా పార్టీని చులకన చేసే పనులు చేస్తే ఉపేక్షించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. తమ పార్టీ అధినాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు కక్ష సాధింపు చర్యలు లేకుండా, సమన్వయంతో, అందరూ సమానమే అనే భావంతో ముందుకు సాగిపోతున్నామన్నారు. పార్టీ నాయకుల, కార్యకర్తల, అభిమానుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పార్టీ జెండాలు, ఫ్లెక్సీ చింపిన విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని, చట్టం తన పని తాను చేస్తుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా తమ పార్టీ కార్యకర్తలపై ఇదే ప్రాంతంలో దాడి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తమ పార్టీ సిద్ధాంతాలు, చట్టానికి లోబడి తాము నడుచుకుంటున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.